# బాపు గీయంగ పొంగె రసగంగ

'కావ్యేషు నాటకం రమ్యం' అన్నారు ఆర్యులు. కావ్యాలలో నాటకానికి అంత పెద్ద పీట వేశారు. నాటకం నవరసాల సమ్మేళితం. నాటకం తర్వాత ఆధునిక ప్రక్రియ చలన చిత్రం.

ఏ విజయవంతమైన చిత్రాన్ని తీసుకున్నా అందులో నవరసాలు సమపాళ్ళలో తప్పకుండా ఉంటాయి.

నాటకం అయినా, సినిమా అయినా జీవిత చిత్రణే. జీవితంలోనే నవరసాలు ఉన్నాయి. వాటి పేర్లను కొంత మందే చెప్పగలుగుతారు. అదే వాటి భావ ప్రకటన చూపించమంటే అది బహుకొద్ది మంది నటీనటులు మాత్రమే చూపగలరు.

నవరసాలు నిత్య జీవితంలో మన అనుభవంలోకి వచ్చినా...వాటిని అభినయించి చూపమంటే మాత్రం మనకు సాధ్యం కాదు.

నిజానికి నవరసాలు భావ ప్రకటన ఎలా ఉంటుందో వర్ణన తప్ప చిత్రంగా మనకు ఎక్కడా కనిపించదు. ఆచారికి నాట్యానికి సంబంధించిన శాస్త్రంలో కూడా ఈ నవరసాల ప్రస్తావన, వర్ణన ఉంటుందే తప్ప చిత్రాలలో చూపడం జరగలేదు.

'మనం ఇంత అభివృద్ధిని సాధించాము. నాటకం నుంచి సినిమాకు...సినిమా నుంచి టి. వి.కి...ఎంతో సాంకేతిక ప్రగతిని సాధించాము. అయితే ఇప్పటికీ నవరసాల చిత్రణ మాత్రం రూపుదాల్చలేదు. ఇది లోపమే కదా దీనిని సవరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది' అనుకున్నారు సినీ నటులు నూతన ప్రసాద్.

నూతన ప్రసాద్ నాటక రంగం మీద నుంచి సినిమా రంగానికి వచ్చారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దాల పాటు అనేక క్లిష్టమైన పాత్రలను అతి సమర్థవంతంగా పోషించారు. హీరోలతో సమానమైన గుర్తింపును తెచ్చుకున్నారు.

అయితే 1989 వ సంవత్సరంలో 'బామ్మ మాట —బంగారు బాట' చిత్రంలో నటిస్తున్నప్పుడు ఆయనకి యాక్సిడెంట్ అయ్యింది. వీపు దగ్గర నరాలు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ నడవలేరు. అయినా మొక్కవోని ధైర్యంతో ఆయన మళ్ళీ నటించడం ప్రారంభించారు.

ఆయనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రవీంద్రభారతి కార్యదర్శిగా నియమించారు. రవీంద్రభారతి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాక నూతనప్రసాద్‌కి వచ్చిన ఆలోచనకు బాపు ఇచ్చిన రూపమే 'నవరసాల' చిత్రమాలిక.

నవరసాలు అంటే శృంగారం, హాస్యం, కరుణ, రౌద్రం, వీరం, భయానకం, బీభత్సం, అద్భుతం, శాంతం.

ఈ రసాల గురించి ఔత్సాహిక నటీనటులు తెలుసుకోవాలని అనుకోవడం సహజం. ఇంతకాలం ఇవి అందుబాటులో లేవు.

ఇప్పుడు నూతన ప్రసాద్ నడుం బిగించి వీటిని రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, రంగ స్థల వేదికలలో ఉంచి అందరికీ అందుబాటులో తీసుకొచ్చారు.

పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో గత సంవత్సరం మార్చి 1 వ తేదీన నవరసాల చిత్రాలను పెట్టడం జరిగింది. రవీంద్రభారతి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, రంగారెడ్డి జిల్లా పరిషత్ కేంద్రం, విశాఖపట్టణం కళాభారతి, రాజమండ్రి వెంకటేశ్వర ఆనం కళా కేంద్రం, కరీంనగర్ కలెక్టర్ భవనం, అనంతపూర్ లలితకళా పరిషత్, తెనాలి నన్నపనేని వెంకట్రావు కళా మండపం, కర్నూలు సునయన ఆడిటోరియం మొదలైన చోట్ల కూడా నవరసాల చిత్రాలను బహుకరించారు.

త్వరలో వీటిని విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నల్గొండ మొదలైన ప్రాంతాలకు కూడా పంపించే అవకాశం ఉంది.

ఒక కళాకారుడుగా సాటి కళాకారులకు ప్రేరణ కలిగించే లక్ష్యంతో స్వంత డబ్బు వెచ్చించి, మిత్రులూ, శ్రేయోభిలాషుల సహాయ సహకారాలతో వీటిని నూతన్‌ప్రసాద్ బహుమతిగా అందిస్తున్నారు.

భరతుని నాట్యశాస్త్రంలో పేర్కొన్న నవరసాలకు మన బాపు వేసిన బొమ్మలు మనల్నే కాదు ఇతర భాగాల వారిని సైతం అబ్బురపరుస్తాయి. 'బాపు' రే అనిపిస్తాయి.

—భగీరథ